తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

మంగళవారం

14 అక్టోబర్ 2025

పేజీలు : 8

Follow :


### విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న

## ఎ.ఈ , లైన్మెన్ లపై చర్యలు తీసుకోవాలి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి):** పంట పొలాలు ఎండి పోవడానికి గల కారణాలైన వారి పై , విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎ.ఈ , లైన్మెన్ ల పై చర్యలు తీసుకోవాలని బండి మల్లయ్య యాదవ్ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి మల్లయ్యా యాదవ్ మాట్లాడుతూ... కరీంనగర్ రూరల్ మండల మొగుదుంపూర్ గ్రామ శివారులోని పురేణిగుట్ట వ్యవసాయ భూములలో 4 కరెంటు స్థంబాలు రైతులకు (మాకు) తెలియకుండా అక్రమంగా ఎ.ఇ. నరేష్ వేయించారని, అవి తీయమని ఎన్నిసార్లు ఎ.ఇ. నరేష్ కు, లైన్మెన్ కు తెలిపినప్పటికి తీయలేదని, సంబంధిత అధికారులపై చర్య తీసుకోని ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ని బండి మల్లయ్య యాదవ్ కోరినారు. అందులో ఒక స్థంభం విరిగి పోయిందని దాని వలన కరెంటు మిగతా 5లో

## పోలీస్ శిక్షణ సెంటర్ ను పర్యవేక్షించిన పోలీస్ కమీషనర్



**ఎడపల్లి, అక్టోబర్ 13 ( జనంసాక్షి ) :** ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేట వద్ద గల పోలీసు శిక్షణ కేంద్రాన్ని సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, రాబోయే శిక్షణార్థులకు అనుకూలంగా ఉండే విధంగా అవసరమైన సౌకర్యాలు, వసతులు అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు. పోలీస్ శిక్షణ సెంటర్ అనేది భవిష్యత్ పోలీస్ అధికారుల పాత్రను తీర్చిదిద్దే కేంద్రం. ఇక్కడ శిక్షణ పొందేవారికి శారీరక , మానసిక అభివృద్ధి జరిగేలా వాతావరణం ఉండాలి. తగిన వసతులు , శిక్షణా పరికరాలు , మరియు శిక్షకులు అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. సెంటర్లో వసతులు , ట్రైనింగ్ సెంటర్ గదులు, వంటశాల, నీటి సరఫరా, శౌచాలయాలు, ఇండోర్ తరగతి గదులు, అవుట్ డోర్ పరేడ్ గ్రౌండ్, ఫైరింగ్ రేంజ్ తదితర అంశాలను పరిశీలించిన ఆయన , తక్షణమే కొంతమేర మెరుగుదల చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసిపి శ్రీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సి.ఐ విజయ్ ఈ బాబు, ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### పలు ప్రాంతాల్లో విస్తృతంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమి పూజలలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి): కరీంనగర్ నగర విలీన గ్రామం బొమ్మకల్ కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్దుంపూర్, చర్లభుత్కూర్, చామన్ పల్లి, జూబ్లీ నగర్ గ్రామాల్లో పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాలలో విస్తృతంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. అన్ని ప్రాంతాలలో కలిపి యాభైకి పైగా ఇళ్లకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని పనులు ప్రారంభించి లబ్ధి దారులకు శు భాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆనాడైన ఈనాడైన ఇందిరమ్మ రాజ్యంలోనే ఇళ్లు కట్టించడం జరుగుతుందని మిగితా ప్రభుత్వాలు మాటల వరకే పరిమితం అయ్యాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులై ఉండి ఇళ్లు మంజూరు కాక మిగిలిపోయిన ప్రతి ఒక్కరికి రాబోయే రోజుల్లో తప్పకుండా మంజూరు చేస్తామని నరేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో బ్లాక్ అధ్యక్షులు సాయిని తిరుపతి, మండల్ అధ్యక్షులు కామరెడ్డి రాంరెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, మీసాల సాయిలు, గంగయ్య, నరసయ్య, కూర నరేష్ రెడ్డి, బుర్ర నారాయణ, రంగయ్య, జగ్గాని కనకయ్య, శంకరయ్య, బుర్ర గంగయ్య, రామస్వామి, దామోదర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, బుసా సాయి,రాము, సుదర్శన్, బుర్ర హరీష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధ దంపతుల పై హత్య , హత్యాయత్నం కేసు నిందితుడు అరెస్టు

### బంగారం, నగదు, మత్తు మాత్రలు, మొబైల్ పోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లాలోని గంగాధర పోలీసు స్టేషన్ పరిధిలోని గర్షకుర్తి గ్రామంలో ఇటీవల జరిగిన వృద్ధ దంపతులపై హత్యాయత్నం, హత్య కేసులో గంగాధర పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కత్తి శివ (37) ను అరెస్టు చేసి, అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలు, నేరానికి ఉపయోగించిన మత్తు మాత్రలను, సెల్ పోన్ ను స్వాధీనం చేసుకున్నారు. గర్షకుర్తి గ్రామానికి చెందిన గజ్జల శంకరయ్య (76), అతని భార్య గజ్జల లక్ష్మి (70) అనువారు ఒంటరిగా ఉంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన నిందితుడుకత్తి శివ అనేవ్యక్తి అప్పుడప్పుడు వారికి బయట నుండి మిగతా 9లో

## భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి

### ○ భీమేశ్వర ఆలయంలో ఏర్పాట్లను ఆలయ ఈవో తో కలసి పరిశీలించిన ప్రభుత్వ విప్



**వేములవాడ, అక్టోబర్ 13 (జనంసాక్షి):** రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా భీమేశ్వర ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం భీమేశ్వర ఆలయంలో తుది దశకు చేరిన ఏర్పాట్లను ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయం అభివృద్ధి విస్తరణ చేపడుతున్న నేపథ్యంలో భక్తులకు, స్వామి వారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ భక్తుల వసతులపై ప్రత్యేక దృష్టి సారించి రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల దృష్ట్య 150 కోట్లతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేపడుతున్నామని అన్నారు. ఇప్పటికే వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు పనులు సాగుతున్నయని తెలిపారు. విస్తరణ సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అతి ప్రాచీనమైన అత్యంత విశిష్టత కలిగిన భీమేశ్వర ఆలయంలో భక్తుల దర్శనాలు ఆర్జిత సేవలను ఇప్పటికే ప్రారంభం చేసుకోవడం జరిగిందన్నారు. రాజన్న ఆలయం బంద్ అనేది ఆ వాస్తవమని ప్రతినిత్యం రాజన్నాలయంలో స్వామివారికి నిత్య పూజలు ఏకాంతంగా జరుగుతాయన్నారు.రాజన్న ఆలయంలో పనులు జరిగే క్రమంలో భీమేశ్వరాలయంలో ప్రత్యేకంగా దర్శనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.భక్తుల విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తాం అన్నారు.ఆయన వెంట ఈవో రమాదేవి, ఈఈ రాజేష్, డిఈ రఘునందన్, ఏ ఈ ఓ బ్రాహ్మణ గారి శ్రీనివాస్, ఉమేష్ శర్మ, ఆలయ ఇన్చార్జి స్థానాచారి నమిలికొండ ఉమేష్ శర్మ, తదితరులు ఉన్నారు.

## అక్టోబర్ 28 లోపు పారామెడికల్ కోర్సులు ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ

### ప్రిన్సిపల్ డాక్టర్ హిమ బిందు సింగ్

**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :** అక్టోబర్ 28 లోపు పారామెడికల్ కోర్సులు ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ హిమ బిందు సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా నడుస్తున్న 28 అలైడ్ హెల్త్ సైన్స్ కళాశాల నందు తెలంగాణ పారామెడికల్ డిప్లమా కోర్సులలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం తెలంగాణ పారామెడికల్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిందని అన్నారు.డి.ఎం.ఎల్.టి నందు 30 సీట్లు, దయాలసిస్ నందు 30 సీట్లు కోర్సులలో చేరడానికి ఇంటర్ నందు బైపిసి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, బైపిసి విద్యార్థుల సరిపడా లేని సందర్భంలో ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు అవకాశం ఇవ్వడం జరుగుతుందని అన్నారు.అక్టోబర్ 28 సాయంత్రం 4 గంటల లోపు సింగరేణి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ప్రభుత్వ వైద్య కళాశాల) రామగుండం నందు దరఖాస్తు స్వీకరిస్తామని అదనపు సమాచారం కొరకు పారామెడికల్ బోర్డు వెబ్ సైట్ హెచ్ టి టిపిఎస్//టీ జి ఎం బి పి. తెలంగాణ.గౌ ఇన్/ సందర్శించాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అంగన్వాడి టీచర్‌కు మెమో జారీ

**కమ్మర్పల్లి 13 అక్టోబర్(జనంసాక్షి)** మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లోని కోడిగుడ్లను కిరణ షాపులో విక్రయిస్తున్న విషయాన్ని జనంసాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కదనానికి సిడిపిఓ స్వర్ణలత సోమవారం విచారణ చేయగా అంగన్వాడి సెంటర్ లోని కోడిగుడ్లు లబ్ధిదారులు కానటువంటి వారికి ఇవ్వడం జరిగిందని విచారణలో స్పష్టం అవడంతో అంగన్వాడీ టీచర్ కు మేము జారీ చేయడం జరిగింది.మరియు శాఖా పరమైన చర్యలకు ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా వివరాలు వెల్లడించడం జరిగిందన్నారు.





## ఓసీపీ-3 ప్రాజెక్టు లోని సమస్యలను పరిష్కరించాలని వినతి

**యైటీంక్లయిన్ కాలని అక్టోబర్ 13 (జనంసాక్షి) :** సింగరేణి ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 ప్రాజెక్టులో నెలకొనియున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు గని ప్రాజెక్టు అధికారి ఉదయ్ హరిజన్‌ను కలిసి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రాజెక్టులో రోడ్లు పూర్తిగా పాడైపోయి ఉన్నాయని, సరిపడా గ్రేడర్లు డోజర్లు లేవు, డంపర్లలో ఏసీలు సరిగా పనిచేయడం లేదని, పైలెట్ క్వారీ నందు లైటింగ్ సరిగా పనిచేయడం లేదన్నారు. ఇట్టి విషయాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించిన తర్వాతే సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీగాని పెట్టాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు ఎల్. ప్రకాష్, ఎం. మహేందర్, శ్రీనివాసరెడ్డి, చింతల మురళి, సాదరి రమేష్, జి. వెంకటేష్, శ్యాంసన్, గడ్డం రాజ్ కుమార్, ఎంబడి పోషన్న, కొయ్యడ వేణు పిడుగువెంకటేష్ సాగే కృష్ణ బూర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

**యైటీంక్లయిన్ కాలని అక్టోబర్ 13 (జనంసాక్షి) :** పట్టణములోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానసిక వైద్య నిపుణులు డా॥ రవికుమార్ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థుల ప్రవర్తన, అలవాట్లు ఎలాం ఉండాలనేది వివరించారు. పిల్లలు ప్రతి విషయాన్ని సంతోషంగానీ, కోపంగానీ, బాధనిగానీ తల్లిదండ్రులతో పంచుకోవాలని సూచించారు. మొబైల్ వాడకం మంచిది కాదని, ఆ సమయాన్ని స్నేహితులతో ఆరుబయట ఆడుకోవాలని సూచించారు. దీని వలన మెదడు పని చేసే విధానం మెరుగవుతుందని తెలిపారు. పిల్లలు బయట ఫుడ్ ఏమి తినకూడదని, ప్రోటీన్లు కలిగిన పండ్లు, పాలు, గుడ్లు మొదలైన బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆనంతరం డాక్టర్ రవికుమార్‌ని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గూళ్ల లక్ష్మణ్ కుమార్, హెచ్ఎం గూళ్ల మానస, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## చదరంగ పోటీలలో ఐపీఎస్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ




**సుల్తానాబాద్,అక్టోబర్ 13 (జనంసాక్షి) :** జిల్లా స్థాయి చదరంగ పోటీలలో ఐపిఎస్ పాఠశాల విద్యార్థిని అత్యుత్తమ, ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా స్థాయి చదరంగ పోటీలు శనివారం ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈ పోటీలలో స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థిని 14 సంవత్సరాల బాలికల విభాగంలో ఏ.అన్విత బ్రాంజ్ మెడల్ సాధించి ఉమ్మడి జిల్లాకు ఎంపికయ్యారు. ఎంపిక పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా మాటేటి కృష్ణప్రియ సంజీవ్ మాట్లాడుతూ, చదరంగం ఆడటం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల,జ్ఞాపక శక్తి పెరుగుతుందని,విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, శివ సతీష్ మమత పాల్గొన్నారు.

## 15 న బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

**సుల్తానాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి) :** బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు డిస్టిక్ యూత్ ఆఫీసర్ ఎం వెంకట రాంబాబు టోర్నీ నిర్వాహకులు మహేష్ తెలిపారు. ఈనెల 15,16 తేదీలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సుల్తానాబాద్,జూలపల్లి మండలాల బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలురకు వాలీబాల్,కబడ్డీ,400 మీటర్స్ రన్నింగ్, షార్ట్ పుట్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు, రెండు మండలాలకు చెందిన 15 నుంచి 29 సంవత్సరాల మధ్య గల యువకులు ఈ పోటీలో పాల్గొనేందుకు అర్హులని, 14 తేదీన సాయంత్రం ఐదు గంటల లోపు రిజిస్టర్ చేసుకోవాలని, రిజిస్టర్ చేసుకునే క్రీడాకారులు 7993604489, 7702360978 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు మహేష్ తెలిపారు.

## సుల్తానాబాద్ లో ఆర్ఎస్ఎస్ కవాతు

**- ఘనంగా ఆర్ఎస్ఎస్ దశాబ్ది ఉత్సవాలు**

**- పాల్గొన్న బిజెపి పార్టీ శ్రేణులు - పురవీధుల గుండా భారీ ర్యాలీ**



**సుల్తానాబాద్, అక్టోబర్ 13(జనంసాక్షి) :** సోమవారం సుల్తానాబాద్ లో ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) దశాబ్ది ఉత్సవాల సందర్భంగా, భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం నుండి ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ కవాతు అంబేద్కర్ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు, బస్టాండు నుండి తిరిగి వేణుగోపాలస్వామి దేవాలయం వరకు నిర్వహించారు. ఈ కవాతులో బిజెపి పార్టీ శ్రేణులు జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్,మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారి కామని రాజేంద్రప్రసాద్, కూకట్ల నాగరాజు, గజబీన్ కార్ పవన్, తుమ్మ రాజ్ కుమార్, ఏ గోలపు సదయ్య గౌడ్, గుడ్ల వెంకటేష్, ఎల్లంకి రాజన్న, పల్లె తిరుపతి, కందునూరి కుమార్, చిట్టవేణి సదయ్య, కార్తీక్ యాదవ్, చాత్రాజ్ రమేష్, నాగుల మల్యాల తిరుపతి, భాగ్యలక్ష్మి, తో పెద్ద ఎత్తున బిజెపి పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## కదంబ పూర్ గ్రామానికి 2వ కొనుగోలు కేంద్రం మంజూరు చేయండి

### ప్రభుత్వానికి గ్రామ రైతుల ప్రత్యేక విజ్ఞప్తి



**సుల్తానాబాద్, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** సుల్తానాబాద్ మండలం కదంబ పూర్ గ్రామంలో సుమారు వరి పంట 2300.కు పైగా సాగు విస్తీర్ణకు అణువుగా ఉన్నందున రెండు పంటలు వరి పంటలు పండుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం నంబర్ టు రాజీవ్ నగర్ లో ఏర్పాటు చేసి రైతు లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తూ సోమవారం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత జాయింట్ కలెక్టర్ నుకలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. అంతేకాకుండా, జిల్లా మార్కెట్ అధికారి డి సి ఓ కు, సుల్తానాబాద్ సహకార సంఘం అధికారులకు ప్రత్యేక విజ్ఞప్తి చేస్తూ విజ్ఞాపన పత్రం అందివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కడారిసునీల్ తోపాటు కదంబ పూర్ గ్రామ నాయకులు రైతులు,గోస్కుల రాజయ్య గోస్కుల కొమురయ్య (గుడి) గోస్కుల కొమురయ్య మీససంతోష్, మీస రాజయ్య పెద్దమనిషి రాజయ్య,తొంటి బీరయ్య,గోస్కుల తిరుపతి ,కరే గంటయ్య ,గోస్కుల తిరుపతి ,గోసుకుల జగ్గయ్య,గోసుకుల ఐలయ్య,ఎలుక పెల్లి శంకర్,ఓదేలు,తొంటి మల్లయ్య తిరుపతి,గుంటి శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుని పర్యటనను విజయవంతం చేయండి

### బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు



**సుల్తానాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి) :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు మంగళవారం మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండల బిజెపి అధ్యక్షులు ఏ ట మధుకర్ కుటుంబాన్ని పరామర్శించడానికి, తెలంగాణ ట్రైన్ ఎక్స్ప్రెస్ ద్వారా మంచిర్యాల రైల్వే స్టేషన్ కు ఉదయం 9 గంటల 30 నిమిషాలకు చేరుకుంటారని, 10 గంటలకు ఏటా మధుకర్ కుటుంబాన్ని పరమార్సించిన అనంతరం 12 గంటలకు రామగుండం కమిషనరేట్ కార్యాలయం దగ్గర, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని,పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు కోరారు.

# రాజన్న ఆలయ పరిసరాల్లోనే భక్తులకు దర్శనం కల్పించాలి

## ఈవోకు బిజెపి జిల్లా అధ్యక్షుడి వినతి



**వేములవాడ, అక్టోబర్ 13 (జనంసాక్షి):** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగిస్తూనే ఆలయ పరిసరాల్లోనే భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించాలని కోరుతూ బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆలయ ఈఓకు వినతి పత్రం సమర్పించారు. దక్షిణ కాశీగా పేరొందిన రాజన్న ఆలయంలో అభివృద్ధి పేరుతో భక్తులకు దర్శనాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాత్రికి రాత్రే తీసుకున్న నిర్ణయం కోట్లాది మంది భక్తులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందని ఆయన అన్నారు. రాజన్నను దర్శించుకోకుండా భీమన్న వద్దకు వెళ్లాలని చెప్పడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే అని, దర్శన భాగ్యం లేకుంటే ఆలయ శక్తి తగ్గుతుందనే ఆందోళన భక్తుల్లో ఉందని తెలిపారు. బీజేపీ ఆలయ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకుని దర్శనం కల్పిస్తూనే సమాంతరంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నదే జిల్లా శాఖ డిమాండ్ అని స్పష్టం చేశారు. కాశీ విశ్వనాథ్, కేదార్‌నాథ్, అయోధ్య రామ మందిరం, శబరిమల వంటి ప్రసిద్ధ ఆలయాల పునర్నిర్మాణ సమయంలో దర్శనాలు కొనసాగించారని, యాదాద్రిలో సైతం బాలాలయం ఏర్పాటు చేసి భక్తులను దూరం చేయలేదనే చారిత్రక సాక్ష్యాలను ఆయన గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క వేములవాడలో మాత్రమే దర్శనాన్ని నిషేధించడం సరికాదన్నారు. రాబోయే దీపావళి, సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో భక్తులు రాజన్న దర్శనానికి వస్తారని, మూలవిరాట్టును దర్శించుకునే అవకాశం లేకుండా నిషేధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో రాజన్న దర్శనాన్ని నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై హిందూ సమాజం ఆగ్రహంతో ఉందని, ఇతర ఆలయాల అభివృద్ధిలో అనుసరించిన సాంప్రదాయాలనే ఇక్కడ కూడా అమలు చేయాలని బీజేపీ కోరుతోందని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, రాజరాజేశ్వర స్వామి దర్శన భాగ్యాన్ని కల్పించి భక్తుల మనోభావాలను గౌరవించాలని విజప్తి చేశారు. లేనిపక్షంలో భక్తుల మనోభావాలకు అనుగుణంగా బీజేపీ ఉద్యమిస్తుందని, జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని గోపి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు బర్కం లక్ష్మి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలను ఎంపికైన బొప్పాపూర్ విద్యార్థినిలు

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 13, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినిలు ఆదివారం జరిగినటువంటి ఎస్‌జిఎఫ్ అండర్17 ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్లో డి. శృతిక, బి అశ్లేషలు ప్రథమ స్థానంలో గెలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా టీం లో అత్యంత ప్రతిభ కనబరిచిన జెడ్‌పిహెచ్ రాచర్ల బొప్పాపూర్ విద్యార్థినిలు డి. శృతుక, బి. అశ్లేష రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనందున చాలా సంతోషంగా ఉందని పాఠశాల పిడి అక్బర్ తెలిపారు. ఈ నెల 16 నుండి 18 వరకు సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

# వేములవాడ దేవస్థానం అభివృద్ధిని బిజెపి అడ్డుకోవడం మూర్ఖత్వం

## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 13, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ దేశంలో దక్షిణ కాశీగా పేరుపొందిన వేములవాడ రాజన్న ఆలయానికి బిజెపి నాయకులు అప్రతిష్ట తేవద్దని నాయకులను, కార్యకర్తలను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేసిన బిజెపి కార్యకర్తలు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. ఎన్నో సంవత్సరాల క్రింద నిర్మాణమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని విస్తరణలో భాగంగా నిర్మాణపు పనులు చేపట్టడం జరిగిందని ఈ పనిని బిజెపి నాయకులు అడ్డుకోవద్దని హితవు పలికారు. దేవుని ముందు అందరం సమాన భక్తులమేనని శృంగేరి పీఠాధిపతి శ్రీ జగద్గురు పరిశీలన జరిగిన తర్వాతనే ఆలయ పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఇప్పటికైనా కొన్ని వేల సంవత్సరాల చరిత్రలో నిలిచిపోయే విధంగా రాజన్న గుడిని సుందరికరించడం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్‌కే సాబేర బేగం, వైస్ చైర్మన్ గుండాటి రాంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, చెన్ని బాబు, నందికిషన్, గంట చిన్న లక్ష్మి, మెండే శ్రీనివాస్, తిరుపతి గౌడ్, మల్లారెడ్డి, గంట బుచ్చ గౌడ్, బండారి బాల్‌రెడ్డి, గుండ్ల శ్రీనివాస్, అంతర్పుల గోపాల్, రవిలు పాల్గొన్నారు.

# తండ్రియాల లో పోషణ మాసం ప్రోగ్రాం

**కథలాపూర్, ఆగస్టు 13( జనంసాక్షి)** కథలాపూర్ మండలంలోని పోషణ మాసం సందర్భంగా సోమవారం రోజున తాండ్రయాల గ్రామంలో పోషణ మాసం ప్రోగ్రాము కి సూపర్వైజర్ స్రవంతి హాజరై పిల్లలకు జంక్ ఫుడ్ పెట్టవద్దని ఇంటిలో చేసిన ఆహార పదార్థాలు పెట్టాలని అవగాహన కల్పించడం జరిగింది. రోజు వారి వంటలలో చక్కర,ఉప్పు,నూనె వాడకాన్ని తగ్గించాలని అవగాహన కల్పించారు.పిల్లలకు పెట్టే పోషకారాహాన్ని తయారుచేసుకొని వచ్చి పోషకాల గురించి చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లు వరలక్ష్మి, రమ, వనిత, స్వరూప,ఆశా కార్యకర్తలు లత,రాజ్యలక్ష్మి ,మరియు పిల్లలు పాల్గొన్నారు.



# సింగరేణి సంస్థలో.. సీఎంపీఎఫ్ అధ్వర్యంలో 'ప్రయాస్' ప్రత్యేక కార్యక్రమం..

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక భద్రత వినియోగాన్ని హామీగా కల్పించేందుకు సింగరేణి సంస్థలో సీఎంపీఎఫ్ అధ్వర్యంలో 'ప్రయాస్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం ఆర్‌జీ-1 యస్‌ఓటు జీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.భవిష్య నిధి పెన్షన్ దావాలను తక్షణ పరిష్కారానికి సంబంధించి చురుకైన చర్యలు తీసుకోవడంతో జీరో పెండెన్సీ'సాధించడం ముఖ్యలక్ష్యంగా ఈ సమావేశం చేపట్టారు.ఈ సమావేశంలో సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్-1 (రామగుండం) హరిపచౌరి, సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్-2 (రామగుండం) కె.గోవర్ధన్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 825 రివైజ్డ్ పిపిఓ ఆర్డర్స్‌ను యస్‌ఓటు జీఎంకు అందించారు.ఈ సందర్భంగా యస్‌ఓటు జియం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆర్‌జీ-1 ఏరియా ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్ నెంబర్ అలాట్‌మెంట్, పదవి విరమణ పొందిన ఉద్యోగుల క్లయిమ్స్ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

ఈ సందర్భంగా సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్-1 (రామగుండం) హరిపచౌరి మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన ఎలాంటి జాప్యం లేకుండా సియంపియఫ్ కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌ను త్వరితగతిన బొగ్గు మంత్రిత్వ పూర్తి చేయాలన్నారు.ఏరియా జనరల్ శాఖ సంబంధించిన పెండింగ్ పెన్షన్ సమస్యలు పరిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు.మధ్య దళారుల ప్రమేయం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చునని తెలిపారు. సిఎంపిఎఫ్‌కు సంబంధించి ఏదేని పెండింగ్ ఉన్నా గనుల సంక్షేమాధికారులను సంప్రదించాలని తెలిపారు.అలాగే నవంబర్ నెలలో అందరు కూడా పెన్షన్ కొరకు జీవన్ ప్రమాణ్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, పర్సనల్ అధికారులు వేణు, శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, ఫిరోజ్‌ఖాన్, గనుల సంక్షేమ అధికారులు గణేష్, శ్రీనివాస్, రవీందర్, సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం వేడుకలు

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 13, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పోషణ మాసం సందర్భంగా సోమవారం గొల్లపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం పోషణా మాసం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 12 మంది తల్లులకు శ్రీమంతాలు, 8 మంది పిల్లలకు అక్షరాభ్యాసం, 6 మంది పిల్లలకు అన్నప్రాసన చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఓ కళావతి పాల్గొని మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గర్భిణిలకు సూచించారు. పోషకాహారం, పరిశుభ్రతలపై అవగాహణ కల్పించారు. అన్ని రకాల పోషకాలతో చేసిన వంటలు ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జి. కళావతి, ఎఎన్ఎమ్ రిబిక, ఆశా కార్యకర్తలు దేవలక్ష్మి, శోభ, జ్యోత్స్న, గొల్లపల్లి సెక్టార్ అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దు

## ఎస్సై కె. రాహుల్ రెడ్డి




**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 13,(జనంసాక్షి) :** రైతు లు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టవద్దని అలా చేస్తే రోడ్డు ప్రమాదాలు జరిగు తాయని ఎల్లారెడ్డిపేట ఎస్సై కె. రాహుల్ రెడ్డి సోమవారం రైతులకు విజ్ఞప్తి చేశారు. రాత్రి సమయాల్లో రోడ్డుపై ఉన్న వరి ధాన్యాన్ని వాహనదారులు గ్రహించలేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుయన్నారు. రైతులు రోడ్డుపై వరి ధాన్యాన్ని ఆరబోసి వాహనాదారుల ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు. ఎవరైనా రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన, దాన్యం కారణంగా ప్రమాదాలు జరిగితే అట్టి యజమానిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డిపేట ఎస్సై కె. రాహుల్ రెడ్డి తెలిపారు.



# కాంగ్రెస్ హయాంలో అర్హులందరికీ సొంత ఇల్లు

**నిజంసాగర్ అక్టోబర్ 13 (జనంసాక్షి)**

కాంగ్రెస్ ప్రభుత్వ సహాయం లో అర్హులందరికీ ఇందిరమ్మఇల్లు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గొల్ల హనుమాన్లు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం నాడు గ్రామంలో మంజూరు అయినటువంటి ఇందిరమ్మ ఇళ్లకు గ్రామస్తులతో కలిసి భూమిపూజను చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు పెద్ది అంజయ్య, బుడిమే శ్రీనివాస్, గుల హనుమాన్లు, నాగంపల్లి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 11కేవీ విద్యుత్ లైన్ తీగలు తగిలి ఒకరికి తీవ్ర గాయాలు

### కుటుంబం ఆర్థిక సంక్షోభంలో జీవనోపాధి కోసం భార్య వినతి

**నాగిరెడ్డిపేట్,అక్టోబర్ 13 జనం సాక్షి**

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం ఒకరి ప్రాణాల మీదకు తెచ్చింది.విధుల్లో ఉండాల్సిన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గోపాల్ పేట్ గ్రామానికి చెందిన క్యాజువల్ లేబర్ యాదగిరి విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఘోర ప్రమాదానికి గురయ్యారు.వివరాల ప్రకారం మండలంలోని తాండూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ధర్మారెడ్డి ఫీడర్ కింద ఉన్న వెంకంపల్లి ఫీడర్‌లో మరమ్మతులు జరుగుతుండగా,ఆపరేటర్ రవి పొరపాటున మరో ఫీడర్‌కు ఎల్సీ (లైన్ క్లియరెన్స్) ఇవ్వడంతో కరెంట్ షాక్ తగిలి యాదగిరి విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు.అప్పుడు తక్షణమే స్థానికులు అతన్ని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి,అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనతో కుటుంబం తీవ్రమైన మానసిక మరియు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది.గత కొన్ని రోజులుగా యాదగిరి శరీరంలోని అనేక భాగాలు గాయపడటంతో యాదగిరి పూర్తిగా పనిచేయలేని స్థితిలో ఉన్నారు.కుటుంబ పోషణ భారాన్ని భరించలేక ఆయన భార్య బాలమల్లేశ్వరి సోమవారం రోజు ఎల్లారెడ్డి విద్యుత్ విభాగం డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ డిఈఈ. విజయ సారథినీ కలుసుకున్నారు.బాలమల్లేశ్వరి ఈ సందర్భంగా జీవనోపాధి కోసం ఏదైనా చిన్నపాటి ఉద్యోగం లేదా సహాయం చేయమని వినతిపత్రం సమర్పించారు.ఆమె మాట్లాడుతూ..నా భర్తకు ప్రమాదం జరిగినప్పటి నుంచి మాకుటుంబం తీవ్రమైన ఇబ్బందుల్లో ఉంది.యాదగిరి రెండు కళ్ళు కోల్పోయారు.పిల్లల భవిష్యత్తు కోసం,నా కుటుంబం బ్రతికేందుకు నాకు చిన్నపని ఇస్తే మాకు జీవనాధారం లభిస్తుందని భావోద్వేగంగా తెలిపారు.ఈ సందర్భంగా డిఈఈ.విజయ సారథి మాట్లాడుతూ...యాదగిరి గాయపడిన ప్రమాదంపై శాఖ ఇప్పటికే విచారణ జరిపింది.బాధ్యులపై చర్యలు తీసుకున్నాం.అలాగే క్యాజువల్ లేబర్ యాదగిరి వైద్య చికిత్స కోసం శాఖ తరఫున 6 లక్షల వైద్య ఖర్చుల కోసం ఉన్నతాధికారులు అందించారు.ఉన్నతాధికారులకు నివేదిక కూడా పంపించమని తెలిపారు.అయితే బాలమల్లేశ్వరి కుటుంబ పరిస్థితి ఇంకా బలహీనంగా ఉందని,తనకు చిన్నపాటి ఉద్యోగం ఇవ్వాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.కనీసం భార్య బాలమల్లేశ్వరి తాత్కాలిక ఉద్యోగం లేదా శాశ్వత సహాయం అందించి,కుటుంబానికి బలం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ సంఘటన విద్యుత్ శాఖలో నిర్లక్ష్యం వల్ల కలిగిన ప్రమాదాలపై మరోసారి చర్చకు దారితీసింది.అధికారులు మానవతా దృష్టితో ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని ప్రజలు కోరుతున్నారు.



## వాహనం ఢీకొని చిన్నారి మృతి

నిజంసాగర్ అక్టోబర్ 13 (జనంసాక్షి)



నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట గ్రామంలో అశోక లేలాండ్ వాహనం ఢీకొని చిన్నారి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. నిజం సాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట గ్రామానికి చెందిన మ్యాతరి మధురశ్రీ (3) ఇంటి ముందర బహిర్భూమికి వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ అశోక్ లేలాండ్ వాహనం(%ు+17ు% 2435) లో వస్తుండగా చిన్నారి మధుర శ్రీ అకస్మాత్తుగా వాహనం యొక్క వెనక టైర్ల కింద పడింది తీవ్ర గాయాలు కావడంతో ఎల్లారెడ్డి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకురాగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా పాప మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై పాప తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సిపిఆర్ ద్వారా ప్రాణాలు బ్రతికించవచ్చు



**నిజాంసాగర్ అక్టోబర్ 13 (జనంసాక్షి)**

అత్యవసర సమయంలో సిపిఆర్ చేసి నిండు ప్రాణాలను కాపాడవచ్చు అని నిజాంసాగర్ మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్ కుమార్ అన్నారు. సోమవారం నాడు నిజాంసాగర్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు సిపిఆర్ పట్ల అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా హృదయ సంబంధిత ఉన్నటువంటిమస్యలు హార్ట్ ఎటాక్ కు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి వ్యక్తికి సకాలంలో సిపిఆర్ ను చేసి బ్రతికించవచ్చని అన్నారు. ఈనెల 13 నుంచి 17 వరకు సిపిఆర్ చేయడం పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల సిబ్బంది ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ నందు సిపిఆర్ శిక్షణ కార్యక్రమం





**సదా శివనగర్ అక్టోబర్ 13 (జనంసాక్షి)**

మండ లం TGSWRDC., కూప్రియాల్ కళాశాలలో సీపీఆర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సిరిష , ప్రోగ్రామ్ ఆఫీసర్ NVBDCP డాక్టర్ రాధిక , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అస్మా అఫ్షీన్ గారు పాల్గొన్నారు. సీపీఆర్ పట్ల అవగాహన కల్పించడంతో పాటు పొగాకు ఉచిత క్యాంప్ గేమ్ యువత ప్రచారంపై కూడా అవగాహన కల్పించబడింది. కార్యక్రమంలో పాల్గొన్నవారు ప్రమాణ స్వీకారం కూడా చేశారు.డా. అస్మా అఫ్షీన్,మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సదా శివనగర్ వారు పాల్గొన్నారు.



# నల్ల జెండాల నిరసన ప్రదర్శన

**ముస్తాబాద్ అక్టోబర్ 13 (జనంసాక్షి):**

భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ముస్తాబాద్ మండల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్మేట రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చుంచు మల్లన్న, వికలాంగుల మహిళ అధ్యక్షురాలు సడిమెల శోభారాణి, ఈ సందర్భంగా చుంచు మల్లన్న మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ గారి మీద జరిగిన దాడి దళితుల మీద ప్రజాస్వామ్యం మీద రాజ్యాంగం మీద దాడిగానే భావిస్తున్నామని అన్నారు. ఈ దాడి మీద లోతైన విచారణ జరిపించి దాడి చేసిన రాకేష్ కిషోర్ పై దాడి వెనుకున్న శక్తులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈనెల 17న మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున చేయడం జరుగుతుందన్నారు.

### ఎల్ మడుగులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

**మంథని, (జనంసాక్షి) :**



ఎల్ మడుగులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం అయ్యింది. మంథని మండలం ఖాన్ సాయి పేట గ్రామానికి చెందిన గావిడి సురేష్ ( 25 ) నీటిలో మునిగిన మోటారు తియ్యడానికి వెళ్లగా నీటిలోకి జారి గల్లంతయ్యాడు. దీంతో యువకుని ఆచూకీ కోసం పోలీస్, ఫైర్ తో పాటు సంబంధిత అధికారులు గాలింపు చర్యలు చేపడుతుండగా మృతదేహం లభ్యం అయ్యింది మృతుని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు. గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రహదారులపై ధాన్యం ఆరబోయరాదు ఎస్సై గణేష్



**ముస్తాబాద్ అక్టోబర్ 13 (జనం సాక్షి):**

రైతులు పండించిన ధాన్యాన్ని రహదారులపై ఆరబోయడం వలన రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ఎట్టి పరిస్థితు ల్లోనూ రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయవద్దని ఎల్లారెడ్డిపేట మండల రైతు సోదరులకు స్థానిక ఎస్సై గణేష్ విజ్ఞప్తి చేశారు.రైతులు తమ పంట దిగుబడిని రోడ్లపై ఆరబెట్టుకోవడం వలన రాత్రి సమయాల్లో వాహనదారులు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.ఈ కారణంగా విలువైన మానవ ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, ధాన్యాన్ని కోల్పోయే పరిస్థితి కూడా ఉంటుందని ఆయన వివరించారు.రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వలన ప్రమాదాలు జరిగితే, అందుకు కారణమైన ధాన్యం యజమానిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గణేష్ హెచ్చరించారు.రైతులు ఈ విషయాన్ని గమనించి, తమ ధాన్యాన్ని రోడ్లకు దూరంగా, సురక్షిత ప్రాంతాలలో ఆరబెట్టుకోవాలని ఆయన సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలలో చోరీ

**ముస్తాబాద్ అక్టోబర్ 13 (జనం సాక్షి):**



ముస్తాబాద్ మండలం నామపూర్ గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. నిత్వసర సరుకులు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులు గ్యాస్ సిలిండర్లు దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు.



## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిత్రపటానికి క్షీరాభిషేకం

**గంభీరావుపేట అక్టోబర్ 13 (జనంసాక్షి):**
గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి ఎయంసి చేర్మన్ కొమిరిశెట్టి విజయ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిన్నటి రోజు బిజెపి నాయకులు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవాలయ అభివృద్ధిని అడ్డుకుంటు తెలంగాణ ప్రభుత్వం పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఇ రోజు తెలంగాణ ప్రభుత్వ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ రాజన్న ఆలయ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగింది, భక్తులు ఆలయ అభివృద్ధి పనులు పూర్తి అయ్యేవరకు సహకరించాలని రాజన్న భక్తులకు విజ్ఞప్తి చేయడం జరిగింది.రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు అదేవిధంగా శ్రీ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మరొక్కసారి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏఎంసి డైరెక్టర్లు పాక్స్ డైరెక్టర్లు వివిధ హోదాలలో ఉన్న మండల నాయకులు గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్ మడుగులో వ్యక్తి గల్లంతు..!

**మంథని, (జనంసాక్షి) :**



ఎల్ మడుగులో వ్యక్తి గల్లంతనైనా ఘటన మంథనిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మంథని మండలం ఖాన్ సాయి పేట గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి చెందిన మోటార్ చెడిపోవడంతో బయటకు తీయడానికి ఇద్దరు వ్యక్తుల సహాయం కోరాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి నీటిలో జారీ గల్లంతైనట్లు సమాచారం. ఎల్ మడుగులో మొసళ్లు సంచరిస్తుంటాయి. దీంతో మొసళ్ళు తీసుకెళ్లి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తి ఆచూకీ కోసం పోలీస్, ఫైర్ తో పాటు సంబంధిత అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ఎస్ ఆర్ ఎస్ సి రెండో దశ కాలువకు
## భీమ్ రెడ్డి నరసింహారెడ్డి రెడ్డి పేరు పెట్టాలని కలెక్టర్కు వినతి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (జనం సాక్షి):** కామారెడ్డి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ పార్లమెంటు సభ్యులు, ఎంసిపిఐ యు పొలిట్ బ్యూరో సభ్యులు,అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి బి.ఎన్ పార్లమెంటు సభ్యులుగా ఉన్నప్పుడు ప్రస్తుత సూర్యపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి మండలం పనిగిరి ప్రగతి నగర్ వద్ద శ్రీరాంసాగర్ రెండవ దశ ఎస్సారెస్పీ కు 1996 మార్చ్ 6న శంకుస్థాపన చేశారు. దీనివల్ల గోదావరి నది జలాలతో వరంగల్, ఖమ్మం,నల్గొండ జిల్లాలలో 30 మండలాలలో 4 లక్షల 30 వేల ఎకరాలకు సాగునీటిని అందించే నీటి పారుదల పథకం ఇది.ఈ గొప్ప మహత్తర కార్యక్రమానికి బి ఎన్ కల్పించి పూనుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బర్ అన్నారు.2008లో కామ్రేడ్ బి ఎన్ అమరులు అయిన నాటినుండి నేటి వరకు ఈ ఎస్ ఆర్ ఎస్ పి ప్రాజెక్టుకు కామ్రేడ్ బి ఎన్ పేరు పెట్టాలని ఎం సి పి ఐయు ఆధ్వర్యంలో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వాలకు విన్న విస్తూనే ధర్నాలు, నిరాహార దీక్షలు, పాదయాత్రలు లాంటి అనేక కార్యక్రమాలు చేయడం ప్రజలను భాగస్వామ్యం చేస్తూ డిమాండ్ ను ప్రభుత్వం దృష్టికి ఎం సి పి ఐ యు తీసుకెళ్లడం జరుగుతూ వచ్చింది.కానీ నిన్న 12/10/2025 తుంగతుర్తి లో జరిగిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్సారెస్పీ రెండవ దశకు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు పెడతామని ప్రకటించారు.24 గంటలు ఇందుకోసం జీవోను తెస్తామని బహిరంగంగా ప్రకటించారు వీర తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో తుపాకీ చేతపట్టి దొరలకు భూస్వాములకు నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసి దున్నే వానికి భూమి కావాలని 10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర బిఎన్ కి ఉంది. చివరి ప్రాణం పోయే వరకు ప్రజల కోసం తపించి జీవించిన ఉత్తమ పార్లమెంటేరియన్ అలుపెరుగని కమ్యూనిస్టు కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి. ఆ ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలని 17 సంవత్సరాలుగా ఎం సి పి ఐ యు చేస్తున్న పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కనపెట్టి వారి రాజకీయ ప్రయోజనాల కోసం మెజార్టీ ప్రజల అభిప్రాయాన్ని కాదని ఈరోజు రాంరెడ్డి దామోదర్ రెడ్డి గారి పేరు పెట్టడం సవాబు కాదంటూ,రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకొని కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు ను ఎస్ ఆర్ ఎస్ పి రెండవ దశ కు ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నరసింహులు, పరుశురాం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ అభివృద్ధికి బాజాపా వ్యతిరేకం కాదు

- అభివృద్ధి పేరుతో రాజన్నను భక్తులకు దూరం చేస్తారా..
- కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తారా.?
- బిజెపి అర్బన్ మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్..



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 (జనంసాక్షి)
దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ వ్యతిరేకం కాదని అభివృద్ధిని స్వాగతిస్తామని వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ అన్నారు సోమవారం ఆయన అర్బన్ మండలంలోని నంది కమాన్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కోట్లాది ప్రజల ఇలవేల్పు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన రాజన్న క్షేత్రంలో నిత్యం 50 వేల మంది భక్తులు దర్శించు కుంటారన్నారు.రాజన్న క్షేత్రాన్ని అభివృద్ధి పనుల పేరుతో భక్తులకు దూరం చేయవద్దన్నారు. రాజన్నను దర్శించు కుందామని వచ్చే భక్తులు భీమన్న వద్దకు వెళ్లాలని చెప్పడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడం కాదా అని ప్రశ్నించరు. భక్తుల మనో భావాలను పరిగణ లోకి తీసుకుని రాజన్న ఆలయంలో భక్తులకు దర్శనాలు కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన అన్నారు. వారణాసిలోని అత్యంత పురాతన కాశీ విశ్వనాథ్ ఆలయాన్ని అక్కడి ప్రభుత్వం 2019లో పునర్నిర్మాణ పనులను ప్రారంభించి రెండేళ్లలో పూర్తి చేసిందన్నారు. వందల కోట్లు ఖర్చు పెట్టి అత్యద్భుతంగా అలయ రూపు రేఖలను మార్చి ఒకవైపు దర్శన భాగ్యమిస్తూనే ఇంకోవైపు అభివృది పనులను పూర్తి చేసిందన్నారు.యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం మన కళ్లముందున్న ప్రత్యక్ష సాక్ష్యం. 2016 నుండి 2022 వరకు అంటే 6 ఏళ్లకుపైగా పునర్నిర్మాణ పనులు చేపట్టినా ఎన్నడూ యాదగిరి శ్రీ లక్ష్మీనర్సింహా స్వామిని భక్తులకు దూరం చేయలేదన్నారు. ఎక్కడా లేని వివక్ష ఎములాడలోనే ఎందుకన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లాలనుకునే ప్రతి భక్తుడు ఎములాడ రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని వెళ్తారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయంలో భక్తుల దర్శన సౌకర్యం కల్పిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు ఆయన వెంట నాయకులు లింగపల్లి శంకర్,నర్సింగోజు శంకర్,కొలనూరి సంజీవ్ రెడ్డి,జక్కుల మధు,పోచంపల్లి భాను,దామోదర్ రెడ్డి, చొక్కాల మధు, మల్లేశం పాల్గొన్నారు

## రైతులతో ఐకెపి ఎపిఎం సమావేశం



**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 13 జనం సాక్షి**
మండలం లోని ధర్మారెడ్డి గ్రామంలో సోమవారం స్థానిక ఐకెపి ఎపిఎం రామ్ నారాయణ గౌడ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని విక్ర యించి తగిన మద్దతు ధరను పొందాలని సూచిం చారు. బయట దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది గ్రామ రైతులు మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**మంథని, జనంసాక్షి) :**



పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని విజయ క్లినిక్ లో సోమవారం డా, విజయ్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ ఆధ్వర్యంలో కరీంనగర్ కు చెందిన మెడి కవర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. ఈ మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 100 మందికి పైగా పాల్గొనగా వారికి ఉచితంగా 2డి ఎకో, ఇ సిజి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.విజయ్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, లయన్స్ క్లబ్ సభ్యులు బొజ్జ రాజసాగర్, లింగమూర్తి, తిమ్మరాజు శరత్ కుమార్, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు జనరల్ ఫిజీషియన్ లోకేష్, హర్షిత్ లతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల బాంధవుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**ముస్తాబాద్ అక్టోబర్ 13 (జనంసాక్షి):**
ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాడు పిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి గ ఆలయాన్ని సందర్శించి గత ప్రభుత్వం ప్రతి సంవ త్సరం 100 కోట్ల రూపాయలు ఇస్తానని మోసం చేసింది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వచ్చే వంద సంవత్సరాల వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దక్షిణ కాశీ వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చి ఈనాడు ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారి చొరవతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ దిశగా ముందడుగులు వేస్తుంటే బీజేపీ ఓర్వకుండా అనవసర రాద్ధాంతం చేస్తుంది . కేవలం మతం పేరుతో ప్రజల మధ్యలో చిచ్చులు పెట్టి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం ఇకనైనా మానుకోవాలి ఖబర్దార్ బిజెపి నాయకుల్లారా. రాజన్న ఆలయ అభివృద్ధికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి తేవడం చాతకాదు కానీ ఆలయ అభివృద్ధిపై అబాండాలు వేస్తున్నారా మీరా నిజమైన హిందువులు చిత్తశుద్ధితో శృంగేరి పీఠాధిపతులచే శాస్త్రబద్ధంగా ఆలయ అభివృద్ధిని చేపడుతున్న మేము కదా రా నిజమైన హిందువులం. అని అన్నారు ఆలయ అభివృద్ధిలో భాగంగా పెద్ద పెద్ద పిల్లర్లు వేస్తారు కావున అక్కడ భక్తులకు ఇబ్బంది కలుగుతుంది అనే ఉద్దేశంతో రాజన్న గర్భగుడిలో ఏకాంత సేవలు జరుగుతూనే ఉంటాయి భక్తుల యొక్క మొక్కులు మరియు ఆర్జిత సేవలు భీమేశ్వరాలయంలో చేసుకోవచ్చు అని సకల సౌకర్యాలతో భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేశారు దానిని తప్పుపడుతూ వ్యాఖ్యలు చేయడం నిజంగా సిగ్గుచేటు . ఇంతకుమునుపే బిజెపి వాళ్లను ఆలయ అధికారులు ఆలయంలోకి తీసుకెళ్లి మరి రాజన్నకు అన్ని సేవలు యధాతథంగా నడుస్తున్నాయి అని చూపించి వారి యొక్క అన్ని సందేహాలను నివృత్తి చేసినా కూడా కేవలం రాజకీయ లబ్ధి కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. ఇకనైనా ఇలాంటి పిచ్చి పిచ్చి ప్రకటనలు మానుకోవాలి బండి సంజయ్ గారు మీ హోదాకు తగ్గట్టు ప్రవర్తించండి అని హితవు పలికారు, ప్రజా ప్రభుత్వంపై ప్రజల నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై ఎన్ని శాపనార్థాలు పెట్టిన అరిచి గోల పెట్టిన దేవుడు అన్ని గమనిస్తున్నాడు ధర్మం న్యాయం మావైపే ఉంది ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు జిల్లా నాయకులు మండల నాయకులు ప్రజలు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను రారాజుగా చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

❑ ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి



**రుద్రంగి అక్టోబర్ 13 (జనంసాక్షి):** రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యం, ఎక్కువ ధర ఇస్తామని నమ్మబలికే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, రైతులను రారాజు ను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి అన్నారు. ఆయన మానాల రైతు వేదిక వద్ద ఫ్యాక్స్ చైర్మన్ ఏలేటి చిన్న రెడ్డి తో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కౌలు రైతులకు భరోసా వంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవని , రైతులకు ఇబ్బంది కలగకుండా నేటి నుండే కొనుగోలు కేంద్రాల్ని ప్రారంభించామని, రైతులు వరి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు కల్లాల వద్దనే ధాన్యాన్ని ఎండబెట్టుకొని తేమ శాతం 17 దాటకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలులో తూనికల తారుమారు, రేట్ల విషయంలో అవకతవకలు జరుగుతే వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువస్తే స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానాల మోహన్ రెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలు, ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుం జలపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డి, ఫ్యాక్స్ డైరెక్టర్లు జక్కు లింగన్న, జూల భూమన్న, బానోత్ గంగాధర్, మాజీ వైస్ చైర్మన్న పిసరి భూమన్న, నాయకులు జక్కు మోహన్, జక్కు వంశీ, జక్కుల లక్ష్మీనారాయణ, ఇప్ప మహేష్, నారాయణ గౌడ్, తూమ్ రవీం దర్, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకులు భక్తులను తప్పుదోవ పట్టించ వద్దు

### ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి



**రుద్రంగి అక్టోబర్ 13 (జనం సాక్షి)** రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం మండల కాంగ్రెస్ శ్రేణులు భక్తులతో కలిసి రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి ప్రభుత్వ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బిజెపి నాయకులు గుడి నిర్మాణం జరుపుతుంటే రాద్ధాంతం చేస్తున్నారని ఒక వంద 50 కోట్లతో గుడి నిర్మాణం పెద్దలు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయ అభివృద్ధి జరుగుతుంటే కొందరు కావాలని అడ్డుకుంటున్నారని, భక్తు లను తప్పుదోవ పట్టించకుండా ఆల య అభివృద్ధికి సహకరించి పనులు సవ్యంగా జరిగేటట్లు చూడాలన్నారు. భక్తులకు ప్రత్యామ్నాయంగా రాజన్న అనుసంధాన దేవాలయమైన భీమేశ్వర ఆలయంలో ఈనెల 11న వేద పండితుల సూచన సలహాలతో దర్శనాలను ఏర్పాటు చేస్తే దాన్ని చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. ఆలయ అభివృద్ధి శృంగేరి పీఠాధిపతి వారిచే వారి అనుమతులతో ప్రభుత్వం విస్తరణ పనులు చేపట్టిందని, దాదాపు 150 పిల్లర్లు నిర్మించే క్రమంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయంగా భీమేశ్వరాలయం లో సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించి అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎర్రం గంగ నరసయ్య, గండి నారాయణ, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, సామ మోహన్ రెడ్డి, తర్రే లింగం, ఇప్ప మహేష్, పల్లి గంగాధర్, చేలుకల శ్రీనివాస్, దయ్యాల శ్రీనివాస్, దాసరి గంగా రాజం, గండి అశోక్, కటికే హీరోజి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో రాజన్నను దూరం చేస్తారా

❑ కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తారా..

❑ బిజెపి మండల అధ్యక్షుడు కోడె రమేష్..

**గంభీరావుపేట అక్టోబర్ 13 (జనంసాక్షి):** గంభీరావుపేట మండల కేంద్రంలోని బిజెపి ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించడం జరిగింది. మండల అధ్యక్షుడుకోడె రమేష్ మాట్లాడుతూ దక్షిణ కాశీ గా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి కోట్లాది ప్రజల ఇలవేల్పు. కష్టాలను, బాధలను మొరపెట్టుకుంటే కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మన రాజన్న దైవం. కోడె మొక్కులకు పరవశించే పార్వతీ పరమేశ్వరులు కొలువైన పుణ్యక్షేత్రం. దూరభారాన్ని సైతం లెక్క చేయకుండా తెలంగాణసహా యావత్ దేశం నలుమూలల నుండి నుంచి నిత్యం 50 వేల మంది భక్తులు దర్శించుకునే పుణ్యధామం ఎములాడ. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన పర్యాటక ప్రదేశాల్లో ఎక్కువ మంది భక్తులు సందర్శించే దివ్యధామం మన వేములవాడ. ప్రత్యేక పర్యాటక కేంద్రంగా గుర్తింపును కైవసం చేసుకున్న ప్రాంతం మన రాజన్న క్షేత్రం. ఇంతటి మహిమాన్విత క్షేత్రాన్ని అభివృద్ధి పనుల పేరుతో భక్తులకు దూరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమంటే తమ బాధలను దేవదేవుడికి చెప్పుకునే అవకాశాన్ని దూరం చేయడం కాదా? రాజన్నను దర్శించుకుందామని వస్తే భీమన్న వద్దకు వెళ్లాలని చెప్పడం కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడం కాదా? రాష్ట్ర ప్రభుత్వ చర్యలవల్ల రాజన్నను మాకు దూరం చేశారనే ఆవేదనతో భక్తలంతా రగిలిపోతున్నారు. దర్శన భాగ్యం లేకుండే చేస్తే ఆలయ శక్తి తగ్గుతుందనే ఆందోళనతో తల్లడిల్లుతున్నారు. భారతీయ జనతా పార్టీ రాజన్న ఆలయ అభివృద్ధికి వ్యతిరేకం కానేకాదు. భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకుని రాజన్న దర్శన భాగ్యం కల్పిస్తూనే అభివృద్ధికి పనులు చేపట్టాలన్నదే బీజేపీ డిమాండ్. అవసరమైతే రాజన్న క్షేత్రంలోనే ఆగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా బాలాలయాన్ని ప్రాణప్రతిష్ట చేసి భక్తులకు దర్శనం కల్పించాలి అని తెలిపారుఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ సీనియర్ నాయకులు సర్వోత్తమ్ చంద్రం యాదవ్ శ్రీనివాస్ చారి నర్సింలు రాజిరెడ్డి నవీన్ రాజేష్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు,





## వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం..

**గంభీరావుపేట అక్టోబర్ 13( జనంసాక్షి):** గంభీరావుపేట మండలం లోని ముస్తఫా నగర్ గ్రామంలో సోమవారం రోజున ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మిరి శెట్టి విజయ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం చేశారు, కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి, సింగిల్ గౌడ్, డైరెక్టర్ ఎడబోయిన ప్రభాకర్, కోట లింగం, రాజనర్సు, మల్యాల రాజ్వీర్, బండా రమేష్, గౌరీ శంకర్, శివంది దేవేందర్, చిలక స్వామి, ఎల్లం, నందం, తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్ల పంపిణీ

నాగిరెడ్డిపేట,అక్టోబర్ 13 జనం సాక్షి... మండలంలోని జప్తి జానకంపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ దేశబోయిన సాయిలు వాళ్ల కూతురు అమూల్య జన్మదిన సందర్భంగా నోటుబుక్కులను పెన్నులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనసూయ,పంచాయతీ కార్యదర్శి శంకర్ నాయక్,ఎఫ్ఏ. రాములు,ఉపాధ్యాయులు రాకేష్,సిరాజ్ పాల్గొన్నారు.




## పట్టాదారు పాస్‌బుక్ లో తప్పులెప్పుడు సరిచేస్తరు

❑ పట్టా దారు పాస్ బుక్ లో పుల్లూరి రాజమ్మకు బదులుగా పుల్లూరి వజ్రమ్మ పేరు మార్చారు..

❑ సవరణ కొరకు మీ సేవలో దరఖాస్తు పెట్టుకున్న తిప్పుకుంటున్న రెవెన్యూ అధికారులు..

❑ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన పుల్లూరి రాజమ్మ..



జమ్మికుంట, సెప్టెంబర్ 13 (జనంసాక్షి): జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందినపుల్లూరి రాజమ్మకు గ్రామంలో సర్వేనెంబర్ 410|A 25 గుంటలు 411|B|లో నాలుగున్నర గంటల వ్యవసాయ భూమి కలదు. అట్టి భూమికి రైతుబంధు రాకపోవడంతో అగ్రికల్చర్ ఆఫీసర్ ను సంప్రదించగా పుల్లూరి రాజమ్మకు సంబంధించిన పట్టా పాస్ బుక్ లో సర్వే నంబర్ 258/80 లో 30 గుంటల వ్యవసాయ భూమిని చేర్చి పుల్లూరి రాజమ్మకు బదులుగా పుల్లూరి వజ్రమ్మగా రెవిన్యూ అధికారులు పేరును మార్చారు. ఈ సందర్భంగా పుల్లూరి రాజమ్మ మాట్లాడుతూ పై విషయంపై రెవెన్యూ అధికారులను సంప్రదించగా పేరు కరప్షన్ కోసం అప్లికేషన్ పెట్టుకోమన్నారు. తేదీ 30 - 6 - 2025 రోజున పుల్లూరి రాజమ్మ సర్వేనెంబర్ 258/80లోని 30 గుంటల భూమి తనది కాదని దానిని తీసివేసి నా యొక్క పట్టా పాస్ బుక్ లో తప్పుగా నమోదు చేసిన పుల్లూరి వజ్రమ్మ పేరును తొలగించి పుల్లూరి రాజమ్మగా మార్చాలని మీ సేవ ద్వారా భూభారతిలో అప్లికేషన్ పెట్టుకున్నాను. అయినప్పటికీని బాధితురాలినైన తనను రెవిన్యూ అధికారులు పేరు సవరణ చేయకుండా నెలల తరబడి ఆఫీస్ చుట్టూ తిప్పు కుంటు న్నారని సోమ వారం ప్రజా వాణిలో జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేశానన్నారు. ఇట్టి విషయంపై కలెక్టర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరామన్నారు.

# పోలీస్ సిబ్బందికి కిట్ ఆర్టికల్స్ పంపిణీ..

**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ సిబ్బందికి చలి, వర్షానికి,ఉన్ని దుప్పటి, వులేన్ జాకెట్, కాటన్ టీ-షర్ట్, రెయిన్‌కోట్,'స్పెషల్ పార్టీ సిబ్బంది కోసం హవర్‌సాక్స్ (వాటర్‌ప్రూఫ్)లను



రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా సిబ్బందికి అందజేశారు.క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీసుల సిబ్బంది సంక్షేమానికి తాము అత్యంత ప్రాధాన్యత నిస్తామని,వాతావరణ మార్పులు, శ్రమతో కూడిన విధులను దృష్టిలో ఉంచుకుని ఈ వస్తువులను అందించినట్లు సీపీ తెలిపారు.ప్రతి ఉద్యోగి వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీపీ సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్,ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి,శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు..

## పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా..

**గోదావరిఖని, జనంసాక్షి :**
పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాల స్మరణలో భాగంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం 'పోలీస్ ఫ్లాగ్‌డే' సందర్భంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులైన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీ నిర్వహించడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ఈ పోటీలు మూడు భాషల్లో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో 6వ తరగతి నుండి పీజీ వరకు ఉన్న విద్యార్థులు పాల్గొన వచ్చున్నారు.విద్యార్థులు వ్యాసాలను అక్టోబర్ 28వ తేదీ లోగా సమర్పించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని సీపీ తెలిపారు. అంతేకాకుండా రామగుండం పోలీస్ కమీషనరేట్ స్థాయిలో 1,2,3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని సూచించారు. విద్యార్థులు ఈ



అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందాలని సీపీ సూచించారు.

# స్వశక్తి సంఘాలకు బ్యాంకు అధికారులు సహకరించాలి..

**- రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) జె.అరుణశ్రీ..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
స్వశక్తి సంఘాలకు,వీధి వ్యాపారులకు ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు బ్యాంకు అధికారులు సహకరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) జె.అరుణశ్రీ అన్నారు.రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం పట్టణస్థాయి బ్యాంకు అధికారుల కమిటీ (టిఎల్‌బిసి) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీనియారిటీ ప్రాతిపదికన స్వశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ,వీధి వ్యాపారులకు పిఎం స్వనిధి రుణాలను మొదటి, రెండవ,మూడవ విడతలు సకాలంలో మంజూరు చేయాలని కోరారు.లబ్దిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఋణ ప్రక్రియ పూర్తి చేయడానికి అనుకూలంగా ఉండడానికై బ్యాంకులో లబ్దిదారుల డాక్యుమెంట్లు కూడా సకాలంలో సమర్పించాలని అన్నారు. రుణాలను రికవరీ చేయడంలో బ్యాంకు అధికారులకు సిఓలు, ఆర్‌పిలు సహకరించాలని




అన్నారు.ప్రభుత్వం విధించిన లక్ష్యం ప్రకారం రుణాల మజూరుకు బ్యాంకు అధికారులు సహకరించాలని కోరారు.ఎస్‌హెచ్‌జిలు/ఎస్ఎల్ఎఫ్‌లు చురుగ్గా పనిచేసేలా చూడాలని అన్నారు.తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడేందుకు వ్యాపార యూనిట్లు స్థాపించుకునే దిశగా స్వశక్తి మహిళలను చైతన్య పరచాలని అన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత ఉన్న ప్రతి స్వశక్తి సంఘానికి, వీధివ్యాపారికి బ్యాంకర్లు రుణం ఇవ్వాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సిహెచ్ వెంకటేష్ అన్నారు.స్వశక్తి సంఘ సభ్యులు బ్యాంకు రుణం పొందడంలో ఇబ్బందులు ఎదురైయితే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతిప్రసాద్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, మెప్మా టిఎంసి మౌనిక, బ్యాంకు అధికారులు శ్రావణ్‌కుమార్, ఎన్.కిషన్ రెడ్డి, నిషాని ఝా, విష్ణుకుమార్, డి.వెంకటి, యేగోంకర్, నరేష్, ఎంఎస్ రాజ్, లవ్‌కుమార్, స్వాతి , జి, భీమేష్, సిఓలు ఊర్మిళ, ప్రియదర్శిని, శమంత, ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

# 15లోగా ఓపెన్ డిగ్రీ ఫీజు చెల్లింపునకు అవకాశం..

## కో-ఆర్డినేటర్ సుబ్బారావు..

**గోదావరిఖని,జనంసాక్షి :**
డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం 2025-26 విద్యా సంవత్సరానికి గాను బి.ఎ., బి.కామ్., బిఎస్‌సి., విద్యార్థులకు ఏలాంటి అపరాధ రుసుం




లేకుండా అడ్మిషన్ ఫీజు అక్టోబర్ 15లోగా చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిషన్ ఓజా, కో-ఆర్డినేటర్ గద్దల సుబ్బారావు ఒక ప్రకటనలో కోరారు.రెగ్యులర్ ఇంటర్మీడియట్, ఐటిఐ ఓపెన్ ఇంటర్మీడియట్, డిప్లమా, 10×2 పాస్ అయిన వారు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని వారు పేర్కొన్నారు.ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని వారు కోరారు.మరిన్ని వివరాలకు 738292965 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

# అయోధ్యసింగ్‌ను కలిసిన తిరుపతినాయక్..

**రామగుండం, జనంసాక్షి :**
బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ తిరుపతినాయక్ ఇటీవల రామగుండం శాసనసభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఠాగూర్ అయోధ్యసింగ్‌ను అంతర్గాంలో కలిశారు.ఈ సందర్భంగా తిరుపతినాయక్ మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఠాకూర్ అయోధ్య సింగ్ మాట్లాడుతూ తిరుపతి కాంగ్రెస్ పార్టీ కుటుంబంలో చేరినందుకు అభినందిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అంతర్గాం మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరే విధంగా పార్టీ నాయకులు అందరూ పనిచేసి, ఎంపీటీసీలు, జెడ్పిటిసిని గెలిపించుకోవాలని సూచించారు. మండలంలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పార్టీ పటిష్టత కోసం పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పలు గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ డైరెక్టర్లు, మాజీ చైర్మన్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# నల్ల బంగారు నేలపై విరబూసిన ఎర్రని మందారం గుండా మల్లేష్..

## 'ఖని'లో మల్లేష్‌కు నివాళులు అర్పించిన సీపీఐ శ్రేణులు..




**గోదావరిఖని, జనంసాక్షి :**
అలుపెరుగని పోరాట యోధుడు..పేదల పెన్నిధి..,కమ్యూనిస్టు అగ్రనేత గుండా మల్లేష్ 5వ వర్ధంతి సందర్భంగా గోదావరిఖని భాస్కర్‌భవన్‌లో సోమవారం సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, ఆర్జీ-వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ ముందుగా గుండా మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్‌తో కలిసి సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్ మాట్లాడుతూ గుండా మల్లేష్ నిరుపేద కుటుంబంలో జన్మించి 1966లో సిపిఐ పార్టీలో చేరి అనేక కార్మిక కర్షక యువజన పోరాటాల నిర్వహించి అంచలంచెలుగా ఎదిగి సిపిఐ శాసనసభ్యులుగా నాలుగుసార్లు గెలిచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో తన గళాన్ని వినిపించారని అన్నారు.1983లో తెలుగుదేశం పార్టీ ప్రభంజంలో సైతం అసిఫాబాద్ నుండి సిపిఐ ఎమ్మెల్యేగా గెలిచాడని వారు తెలిపారు.మూడుసార్లు ఆసిఫాబాద్ నుండి ఒకసారి బెల్లంపల్లి నుండి శాసనసభ్యునిగా ఎన్నికై సిపిఐ పక్ష నాయకునిగా పనిచేశారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్రం కావాలని గొంతెత్తి నినదించి శ్రీకృష్ణ కమిటీ ముందు ప్రత్యేక తెలంగాణ ఇవ్వాల్సిందేనని కమ్యూనిస్టు పార్టీ తరపున నివేదికను సమర్పించి ఢిల్లీకి వెళ్లి తన వాదనలను గట్టిగా వినిపించాడని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందంటే గుండా మల్లేష్ కృషి, పట్టుదల వల్ల కమ్యూనిస్టు పార్టీ పోరాటం వల్లనేనని వారన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత హక్కుల పోరాట సమితిని ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో దళితుల పట్ల జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు.ఆజాత శత్రువుగా, నిరుపేదల పెన్నిధిగా నియోజకవర్గ ప్రజల ఆప్తమిత్రునిగా ప్రతి ఒక్కరిని కుటుంబ సభ్యులుగా ఆదరించే మంచి మనసున్న మల్లేష్ ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, వారు చేసిన త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేస్తూ పార్టీని ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మడికొండ ఓదేమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కాపురి సూర్య, జిల్లా సమితి సభ్యులు మాటేటి శంకర్, టి.రమేష్‌కుమార్, నాయకులు పడాల కనకరాజ్, గండి ప్రసాద్, వెంకటరెడ్డి, ప్రభుదాస్,మానాల శ్రీనివాస్, జగన్, ఆసాల నవీన్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.




జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో

## సి.పి.ఆర్ పై అవగాహన కార్యక్రమం

**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
ప్రభుత్వ జూనియర్ కళాశాల లో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ ఆధ్వర్యంలో "సి.పి.ఆర్ (కార్డియో పల్మనరీ రెసుసిటేషన్)" పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బందితో కలిసి సిపిఆర్ పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డా. వాణిశ్రీ మాట్లాడుతూ "ఆకస్మికంగా గుండె ఆగిపోయిన వ్యక్తిని గమనించిన వెంటనే శ్వాస కొనసాగుతున్నదా లేదా పరిశీలించాలని వెంటనే 108 కు సమాచారం ఇచ్చి, సిపిఆర్ చేయడంతో గుండె ఆగిన వ్యక్తికి పునర్జీవనం కల్పించ వచ్చున్నారు. ఇది సాధారణ పౌరులు కూడా నేర్చుకొని, అవసరమైన సమయంలో ప్రాణాలు కాపాడగలిగే విధంగా ఉపయోగపడు తుంది" అని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని అక్టోబర్ 13 నుండి 17వ తేదీ వరకు వివిధ కార్యక్రమాల ద్వారా జరుపుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డా. ఆర్. రాజమౌళి, డా. బి. శ్రీరాములు, డా. బి. కిరణ్ కుమార్, వైద్యాధికారి డా. లక్ష్మీ భవానీ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రవీందర్ రెడ్డి, ఎన్సిడి సిబ్బంది టీ. రాజేశం, ఏ. మధుసూదన్ మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా కల్చరల్ సెక్రటరీగా మంద భాస్కర్ యాదవ్



**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
ఆర్ఆర్ గార్డెన్ లో జరిగిన పెద్దపెల్లి జిల్లా ఔషధ వర్తక సంఘం అధ్యక్ష కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా జిల్లా కల్చరల్ సెక్రటరీగా డాక్టర్ మంద భాస్కర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ సహజ కవి సామాజిక రచయిత నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు మాడూరు వినోద్ కి ప్రధాన కార్యదర్శి రాజేంద్ర అన్న కి కోశాధికారి పోలు సతీష్ కి జిల్లా కార్యవర్గ సభ్యులకు గౌరవ సభ్యులకు నా శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేపీ చీఫ్‌ను కలిసిన 'క్యాతం'

**గోదావరిఖని, జనంసాక్షి :**



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావును సీనియర్ బీజేపీ నాయకులు క్యాతం వెంకటరమణ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా 100 రోజులు పూర్తి కావస్తుండగా దాదాపు 70 రోజులకుపైగా రాష్ట్రంలో పార్టీ విస్తరణ కు జిల్లాలలో పర్యటించి కార్యకర్తలను కార్యోన్ముఖులుగా తీర్చి దిద్దటానికి చేస్తున్న కృషి అభినందనీయమని బీజేపీ సీనియర్ నాయకులు క్యాతం వెంకటరమణ అన్నారు. అదేవిధంగా పార్టీ కార్యకర్తల్లో స్ఫూర్తిని నింపుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక స్థానాలు గెలిపించటానికి సలుపుతారని ఆయన పేర్కొన్నారు.



## విద్యార్థినికి ఎంబీబీఎస్‌లో సీటు

### బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం సన్మానం

**వేములవాడ, అక్టోబర్ 13 (జనంసాక్షి):**
వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన లింగాల శంకర్ మొదటి కూతురు ఉనిక్యా తన అంకితభావంతో మూడోసారి ఎంబిబిఎస్ లో సీటు సాధించడం తో తమ ఊరికే గర్వకారణమని, పట్టు సడలకుండా తన లక్ష్యాన్ని చేరుకోవడం అభినందనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం అన్నారు. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1, 2 వార్డు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నల్ల సతీష్ రెడ్డి, గుడిసె అనిల్ కుమార్, అయిత వెంకటేష్, వికుర్తి సాయిబాబ, గుడిసె క్రాంతి, గుడిసె రమేష్, లింగాల మనోజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరేణి మారుపేర్లు..విజిలెన్స్..పెండింగ్ కేసులపై..

### సీఎండీకి శ్రీనివాస్ వినతీపత్రం..

**గోదావరిఖని, జనంసాక్షి**



సింగరేణిలోని 11 ఏరియాల్లో ప్రస్తుత ప్రధాన సమస్యలు మారుపేర్లు.. విజిలెన్స్.. పెండింగ్ సమస్యలు అనేక సంవత్సరాలుగా ఉన్నాయని సీఎండీ బలరాంనాయక్‌కు సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫౌండర్, అధ్యక్షులు కొంకటి శ్రీనివాస్ వినతీపత్రాన్ని అందించారు. మారుపేర్ల పరిష్కారానికి అనేకసార్లు అనేక విధాలుగా సింగరేణి యాజమాన్యానికి కార్మికులు, కార్మికుల పిల్లలు వినతీపత్రాలు అందించారని శ్రీనివాస్ తెలిపారు. ధర్నాల ద్వారా సింగరేణి యాజమాన్యానికి తెలుపుతున్నా యాజమాన్యం కాలయాపన చేస్తు వస్తుందని పేర్కొన్నారు. ఇప్పుడు..అప్పుడు అనడమే తప్ప పరిష్కారంలేని సమస్యగా మారుతోందన్నారు. ఈ కాలపరిమితితో మారుపేర్లు, విజిలెన్స్.. పెండింగ్ కేసులతో సింగరేణి ఉద్యోగ కుటుంబాల్లో తండ్రిపిల్లలు మాట్లాడుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తండ్రిపైన పిల్లలకు ప్రేమపోయి ద్వేషం నెలకొనే పరిస్థితులు ఉన్నాయని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సమస్య వలన ఇద్దరి ప్రాణాలు పోయినట్టు సమాచారం ఉందన్నారు. ఇప్పటికి అయినా సింగరేణి యాజమాన్యం ఆలోచన చేసి మారుపేర్లు..విజిలెన్స్..పెండింగ్ సమస్యలతో మరో సింగరేణి కుటుంబం దుఃఖంలోకి పోకముందే సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు.



## వసతి గృహాలకు పంపిణీ చేసే సరుకుల ధరలు పెంచడం హర్షణీయం

**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**
రాష్ట్రంలోని వసతి గృహాలకు సరఫరా చేసే సరుకుల ధరలను పెంచడం హర్షనీయమని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంకటి లింగమూర్తి, కోశాధికారి భాస్కర్ అనిల్,ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగపురి మనోహర్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ గురుకుల అసోసియేషన్ తరపున ప్రభుత్వానికి వసతి గృహాల సప్లైదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఇతర అధికారులకు విన్నవించామని పేర్కొన్నారు. గత జూన్ నుండి వసతి గృహాలకు క్యాటరింగ్ కిరాణ, చికెన్, మటన్, కూరగాయలు పాత రేట్లతోనే వేస్తున్నామని దానివల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేట్లు పెంచడం వల్ల కొంత ఉపశమనం కలిగిందని కాంట్రాక్టర్లు వాపోయారు. మార్కెట్లో ఉన్న రేట్ల ప్రకారం మరోసారి పెంచాలని కోరారు. సరుకుల రేట్లు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్

**పెద్దపల్లి,అక్టోబర్ 13(జనంసాక్షి) :**



పెద్దపల్లి పట్టణం రంగంపల్లి కి చెందిన పర్లేళ్ల లక్ష్మి తన పని నిమిత్తం సోమవారం రంగంపల్లి నుండి ఆటోలో జెండా చౌరస్తా కు వెళ్లిన క్రమంలో ఆమె ఆటోలో తన చేతి సంచిని మర్చిపోవడం జరిగినది. అతర్వాత ఆటో డ్రైవర్ కుంభాల ప్రభుదేవా తన ఆటోలో ప్రయాణికులు మర్చిపోయిన చేతి సంచిని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి సమాచారం ఇవ్వగా ఎస్ఐ జై లక్ష్మణ్ రావుఅట్టి ప్రయాణికురాలను గుర్తించి ఆటో డ్రైవర్ ద్వారా చేతి సంచిని ఆమెకు ఇప్పించడం జరిగింది. అట్టి సంచిలో తన 17 వేల రూపాయలు యధావిధిగా ఉన్నవని ఆమె తెలపగా, నిజాయితీ ని చాటుకున్న ఆటో డ్రైవర్ ప్రభుదేవ ను ఎస్ ఐ.లక్ష్మణ్ రావు గ అభినందించారు.

# రాజన్న ఆలయం రాజకీయాలకు వేదిక కాదు

○పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ చిత్రపటానికి పాలాభిషేకం

**వేములవాడ (జనంసాక్షి):**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయాన్ని రాజకీయాలకు వేదికగా మార్చవద్దని పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో నిన్న బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను తగలబెట్టడాన్ని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ?ఈ నేపథ్యంలోనే, ఆలయ అభివృద్ధికి మద్దతు తెలుపుతూ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాజన్న ఆలయం ముందు ప్రభుత్వ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ?ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేయడమే తప్పేం ఉంది? అని ప్రశ్నించారు. భక్తులకు తాత్కాలికంగా ఇబ్బందులు ఎదురవుతున్నా, అభివృద్ధి పనులు నిలిపే ప్రసక్తే



లేదని వారు స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక కేంద్రమైన రాజన్న ఆలయంపై రాజకీయం చేయడాన్ని మానుకోవాలని వారు బీజేపీ నాయకులకు సూచించారు. ?రాజన్న ఆలయ అభివృద్ధి అంశంపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పాలాభిషేకం కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి కి నిరసనగా

# ఎమ్మార్పీఎస్ కలెక్టరేట్ ముట్టడి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 (జనంసాక్షి)**
ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ గారిపై జరిగిన దాడి ని నిరసిస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ను ముట్టడించి నల్లజెండాలతో నిరసన తెలుపడం జరిగింది.దళితుడైన జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై ప్రజాస్వామ్యంపై న్యాయవ్యవస్థపై యావత్తు దళిత సమాజం పై జరిగిన పాశవిక దాడి అని గుర్తు చేస్తున్నామన్నారు.దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించేలా వారికి కూడా శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన కలెక్టరేట్ ఎదుట నల్ల జెండాలతోఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంఛార్జి మంథని సామ్యేల్ మాదిగ, ముఖ్య అతిథిగా హాజరు కాగా సీనియర్ నాయకులు కంతి పద్మారావు,కొత్తోల్ల యాదగిరి, సట్టిగారి లక్ష్మి, కొత్తూరు సాయిలు, గాంధారి గంగన్న, బాలరాజు గౌడ్ , సాయి, వరుణ్, డాకయ్య, బట్టరమేష్, బాలమణి, పోసాని,శివానందం,సామేలు, తదితరులు పాల్గొన్నారు.







### జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసిన పద్మాకర్ రెడ్డి

**చొప్పదండి ,అక్టోబర్ 13( జనం సాక్షి):**
జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి చొప్పదండి చెందిన డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హొదాల్లో పని చేశానని రాబోవు రోజుల్లో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**చొప్పదండి, అక్టోబర్ 13 (జనం సాక్షి ):** చొప్పదండి మండలంలోని ఆర్నకొండ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుల్తానాబాద్ మండలం భూసాలకు చెందిన మెరుగు సాయికిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. చొప్పదండి నరేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆర్నాకొండ గ్రామంలో ఆదివారం రాత్రి అంబేద్కర్ విగ్రహం సమీపంలో కరీంనగర్ నుండి లక్షెట్టి పేట వెళ్తున్న పాల వ్యాన్ అర్నకొండ నుండి కరీంనగర్ వెళ్తున్న బైక్ ని ఎదురుగా ఢీకొట్టగా సుల్తానాబాద్ మండలం పుసాలకి చెందిన మెరుగు సాయికిరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనకాల కూర్చున్న జడల మహేష్ కి గాయాలు అయినవి.మృతుడి తండ్రి మెరుగు శంకరయ్య పిర్యాదు మేరకు వ్యాన్ డ్రైవర్ ముదేళ్ల రాజు పై కేస్ నమోదు చేసి డీసీఎం వాహనాన్ని పోలీస్ స్టేషన్ తరలించినట్లు తెలిపారు.

## విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎ.ఈ , లైన్మెన్ లపై చర్యలు తీసుకోవాలి

అంతరాయంతో పాటు ఆ పొలంలోకి ట్రాక్టర్ గాని, హార్వెస్టర్స్ గాని రావడంలేదని, అలాగే కరెంట్ ట్రాన్స్ఫర్మర్ కూడా గత కొద్దిరోజుల క్రితం కాలిపోయింది. ఇట్టి విషయం గురించి ఎ.ఈ ని కోరగా విరిగిన స్థంభం తీయకుండా, మరొక స్థంభాన్ని వేసి, లేబర్ అందుబాటులో లేరని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ న్నారని, దీనివలన బావులలో నీరు ఉన్నా గాని, కరెంట్ లేక పంట పొలాలు నీరు లేకుండా ఎండిపోతున్నాయని మేము అప్పులు చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నామని పంట నష్టము జరిగి మా కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలున్నాయన్నారు. సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకొని కరెంటు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయించి, మా పంట పొలాల్లో వేసిన కరెంట్ స్థంభాలను తొలగించి, పంట పొలాలను కాపాడాలని కోరుతున్నామని బండి మల్లయ్య యాదవ్ జిల్లా కలెక్టర్ ను కోరినారు.

## ఓట్ చోరీని అడ్డుకుందాం - ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం



**జమ్మికుంట, అక్టోబర్ 13 (జనం సాక్షి):** ఇల్లందకుంట మండల కేంద్రంలో ఏఐసీసీ,పిసిసి,డిసిసి ఆదేశాను సారం హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ బాబు పిలుపుమేరకు ఇల్లందకుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం రోజున కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అవగాహన పెంచేందుకు “ఓట్ చోరీ” పేరిట సంతకాల సేకరణ కార్యక్రమం, ప్రదర్శనలు నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైన హక్కు ప్రజల ఓటుతోనే ప్రభుత్వం ఏర్పడుతుంది,కానీ దేశంలో ఎన్నికల సమయంలో ఓట్లు చోరీ చేయడం, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు.ఈకార్యక్రమంలోకనుమల్ల సంపత్, వంగ రామకృష్ణ, మీస రాజయ్య, గోరుకుంట్ల స్వామి, మర్రి వీరారెడ్డి, మూడెడ్ల రమేష్, భోగం సాయిరాం, మేకల సురేష్, గొడిశాల పరమేశ్వర్,పెద్ది శివకుమార్,మారేపల్లి ప్రశాంత్, గొడుగు మానస, రేణిగుంట్ల రవీందర్, గూడెపు ఓదెలు,గంగారం మహేష్,భోగం చిరంజీవి, భోగం పృద్వి, జక్కు కుమార్, దంసాని తిరుపతి, రాజేందర్, బొమ్మిడి సతీష్, సప్పి రవి, మొగిలిపాక శ్రీనివాస్, బుర్ర విజయ్ కుమార్, పైడిపల్లి దేవేందర్, జంగం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతుల పై హత్య , హత్యాయత్నం కేసు నిందితుడు అరెస్టు

**బంగారం, నగదు, మత్తు మాత్రలు, మొబైల్ పోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు**

మందులు, అవసరము ఉండే ఇంటి సామానులు తెచ్చి ఇచ్చి సహాయపడేవాడు. శివ ఈ మద్య ఆన్ లైన్ లో బెట్టింగ్ లు, పేకాట లాంటి వాటికి అలవాటు పడి,అప్పులు ఎక్కువ అయి, ఖర్చులు, జల్సాల నిమిత్తం డబ్బులు అవసరము అయి, గజ్జల శంకరయ్య , లక్ష్మి లను చంపి, లక్ష్మి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించాలని పథకం వేశాడు. ప్లాన్ ప్రకారం 2025 అక్టోబర్ 7, ఉదయం 08:30 గంటల సమయంలో, శంకరయ్య, లక్ష్మిలకు జ్వరం, జలుబు , దగ్గు , ఒళ్లు నొప్పులు ఉన్నాయని తెలుసుకొని, వారి ఇంటికి తన దగ్గరున్న మత్తు మాత్రలు ఆ వృద్దుల వద్దకు తీసుకపోయి, ఇవి వేసుకుంటే మీ జ్వరం, జలుబు , దగ్గు, ఒళ్లు నొప్పులు వెంటనే తగ్గుతాయని నమ్మించి, అ ఇద్దరు వృద్దులు ఒక్కొక్కరు ఆరు మాత్రలు చొప్పున మింగేలా చేశాడు. అవి మింగిన సుమారు రెండు గంటల తరువాత ఆ ఇద్దరు వృద్దులు మత్తులోకి అపస్మారక స్తితిలోకి వెళ్లిన తర్వాత, నిందితుడు వారి ఇంటికి వెళ్ళి, లక్ష్మి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించి పరారయ్యాడు. అనంతరం అదే గ్రామంలోని కట్ల శ్రీనివాసాచారి అనే గోల్డ్ స్మిత్ వద్ద ఆ బంగారాన్ని అమ్మి రూ. 1,85,000/- నగదు తీసుకున్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ఆ బంగారం కొన్నటువంటి శ్రీనివాసాచారి వద్ద గతములో కత్తి శివ తన బార్య బంగారు నగలు అమ్మయినందున, అతను నమ్మి, ఆ బంగారం కొని, శివకు డబ్బులు ఇవ్వడం జరిగినది. బంగారం వ్యాపారి ఇచ్చిన డబ్బులు శివ తన అప్పులు తీర్చుకోవడం, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కోసం ఆ డబ్బును ఖర్చు చేసినట్లు తెలిపాడు. అపస్మారక స్థితిలో ఉన్న వృద్దులు శంకరయ్య, లక్ష్మిని సాయంత్రం ఆసుపత్రికి తరలించగా, అక్టోబర్ 08, 2025 మధ్యాహ్నం శంకరయ్య చికిత్స పొందుతూ మరణించాడు. వృద్దురాలు లక్ష్మి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగా ఉన్నది. నిందితుడు కత్తి శివ తండ్రి దేవయ్య (37) ఘర్షకుర్తి గ్రామానికి చెందిన ఇతను అక్టోబర్ 13న ఉదయం మిగిలిన మత్తు మాత్రలను పారేయడానికి వెళ్తున్న సమయంలో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించి, పారిపోతుండగా పట్టుకున్నారు. ఇతని నుండి నగదు రూ. 25,000, మత్తు మాత్రలు 11, దొంగిలించబడిన బంగారం 20 గ్రాముల 250 మిల్లీగ్రాముల బరువుగల బంగారు పుస్తెల తాడు (కట్ల శ్రీనివాస జ్యువెలరీ షాప్ యజమాని కట్ల శ్రీనివాసు నుండి) టెక్నో ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్, సిమ్ కార్డు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలు, అప్పుల కారణంగానే నిందితుడు ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడి పై హత్య, దోపిడీ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. మొదట అనుమానాస్పద మృతిగా ఈ కేసును నమోదు చేసుకుని, డెటెక్ట్ చేయుటకు ఛాలెంజ్ గా తీసుకున్న పోలీసులు ఏ.సి.పి రూరల్ విజయ కుమారు ఆద్వర్యంలో, చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్.ఐ.వంశీకృష్ణ , చారి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ లు జంపన్న , అరవింద్ లను పోలీస్ కమిషనర్ అభినందించారు.

# ఆలయంలో చోరీచేసిన దొంగ అరెస్ట్

### సీసీ కెమెరాతో దొంగను పట్టుకున్న పోలీసులు

**గాంధారి వార్త అక్టోబర్ 13 (జనం సాక్షి)**
గాంధారి మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం గత 25 రోజుల క్రితం,చద్మల్ రోడ్లో గల శివ భక్త మార్కండేయ గుడి నందు గల హుండీనీ ఎవరో గుర్తు తెలియని దొంగలు పగుల గొట్టి హుండీ సొమ్మును ఎత్తుక పోయారు. అని అలాగే అదే రోజు గాంధారి పెద్దమ్మ కాలనీలో నాగ్లూర్ సాయికుమార్ స్ప్లెండర్ ప్లస్ బైకు దొంగలు దొంగలించకపోయినారని పిర్యాదుతో కేసులు నమోదు చేసి సిసి కెమెరాల ద్వారా దొంగతనం చేసిన వ్యక్తినీ గుర్తించి అతడిపై నిఘాపెట్టగా, సోమవారం రోజున గాంధారి కల్లు దుకాణంలో కల్లు తాగున్నాడని సమాచారంరాగా స్థానిక ఎస్ ఐ, సిబ్బందితో పాటు వెళ్ళి దొంగను పట్టుకుని విచారించి శివ మార్కండేయ మందిరం వద్ద దొంగతనం చేసిన తీసుకొని జ్యుడిషియల్ రిమాండ్ గురించి ఎల్లారెడ్డి మేజిస్ట్రేట్, ముందు హాజరు పరచనైనది, అని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.. సీసీ కెమెరాలు చూసి దొంగను పట్టుకోవటానికి కృషి చేసిన కానిస్టేబుల్ సంజయ్ కుమార్, బంతిలాల్, స్థానిక ఎస్ఐ అందించారు. గ్రామ ప్రజలు వర్షం వ్యక్తం చేశారు.

## సింగరేణి కాలువ తవ్వకం తో పంట నష్టం

**బాధిత రైతు ఉడుత అశోక్ ఆవేదన**



జనం సాక్షి రామగిరి : సింగరేణి కాలువ తవ్వకం తో ఒక రైతు పంటకు నష్టం వాటిల్లింది. లద్నాపూర్ భూనిర్వాసితులకు రత్నాపూర్ గ్రామ శివారులో ఇంటి స్థలాలు ఇచ్చారు. రాంనగర్, రత్నాపూర్ పాత ప్లాట్లు, పన్నూరు నుంచి వచ్చే వరద నీరు వెళ్లిపోవడానికి రత్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వరకు భూసేకరణ చేశారు. ఇందులో నుంచి భారీ మట్టి కాలువ తవ్వించారు. సిమెంట్ కాలువ నిర్మించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అది కాస్తా కూలి పోతుంది. ఇదే క్రమంలో ఈ కాలువకు గండి పడి పక్కనే ఉన్న ఉడుత అశోక్ పొలం లోకి వరద నీరు మరలి పంట నష్టం జరిగింది. దీంతో ఆయన పంటకు నష్టం వాటి ల్లింది. ఈ విషయంపై స్థానిక జీఎం కు ఆగస్టు నెలలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రైతు ఉడుత అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సింగరేణి అధికారులు స్పందించి రైతుకు జరిగిన పంట నష్టం పై విచారణ జరిపి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు డిమాండ్ చేశారు.